# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 28-07-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ క్రీడలు, పర్యాటకంతో వాణిజ్య రంగంలో వృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

- ❖ రాష్ట్రంలో ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం క్రింద సోలార్ విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.

- ❖ వ్యవసాయాన్ని సులభతరం చేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం రాయితీపై రైతులకు డ్రోన్లను అందిస్తోందని మంత్రి కె.అచ్చెన్నాయుడు వెల్లడించారు.

- ❖ ఫిడే (FIDE) ప్రపంచ మహిళల చెస్ ఛాంపియన్ షిప్ టైటిల్ ను దివ్య దేశ్ముఖ్ గెలుచుకున్నారు.

==============================

క్రీడలు, పర్యాటకంతో వాణిజ్య రంగాల్లో వృద్ధి సాధ్యమని.. ఆంధ్రప్రదేశ్‌లో క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అత్యుత్తమ క్రీడాకారులను తయారు చేయటంతో పాటు క్రీడా సదుపాయాలు, పెట్టుబడులను ఆకర్షించేలా ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ పాలసీ తీసుకువచ్చామని ముఖ్యమంత్రి అన్నారు. సింగపూర్ పర్యటనలో భాగంగా ఈరోజు ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపిచంద్, మంత్రులు, అధికారులతో కలిసి సింగపూర్ స్పోర్ట్స్ స్కూల్‌ను ముఖ్యమంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా అత్యుత్తమ క్రీడాకారులను తయారు చేయటంతో పాటు వినోదం, పర్యాటకం, వాణిజ్య కార్యకలాపాలకు కేంద్రాలుగా స్పోర్ట్స్ స్కూళ్లు ఉండాలని సింగపూర్ స్పోర్ట్స్ స్కూల్ ప్రిన్సిపాల్ ఓంగ్ కిమ్ సూన్‌తో ముఖ్యమంత్రి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేయాలన్న సంకల్పంతో పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు ఇస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్న క్రీడా రిజర్వేషన్లను 2 నుంచి 3 శాతానికి పెంచామని, అలాగే ఒలింపిక్స్, ఏషియన్ గేమ్స్, వరల్డ్ ఛాంపియన్, నేషనల్ గేమ్స్ లలో పతకాలు సాధించిన వారికి ఇచ్చే ప్రోత్సాహకాన్ని భారీగా పెంచామన్నారు. తిరుపతి, విశాఖపట్టణం, అమరావతిలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్సులు నిర్మిస్తామని వివరించారు. సింగపూర్ స్పోర్ట్స్ స్కూల్ తరహాలోనే కడప, విజయవాడ, విజయనగరంలో క్రీడా పాఠశాలలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

==============================

సింగపూర్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు “ఏపీ-సింగపూర్ బిజినెస్ ఫోరమ్ రోడ్ షో”లో పాల్గొన్నారు. ఈ సంవత్సరం నవంబర్‌లో విశాఖ వేదికగా నిర్వహించనున్న పెట్టుబడుల సదస్సుకు సన్నాహక సమావేశంగా సింగపూర్ లో ఏపీ-సింగపూర్ బిజినెస్ ఫోరం రోడ్ షో ను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ లో అమలు చేస్తున్న నూతన పారిశ్రామిక పాలసీలు, వేగవంతమైన వాణిజ్య విధానంపై ముఖ్యమంత్రి పారిశ్రామిక వేత్తలకు వివరించనున్నారు. అలాగే గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, ఎలక్ట్రానిక్స్, డిఫెన్స్, ఆటోమొబైల్ తదితర రంగాల్లో పెట్టుబడి అవకాశాలపై ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా విశాఖలో జరిగే పెట్టుబడుల సదస్సుకు రావాలని రోడ్ షో వేదికగా సింగపూర్ లోని దిగ్గజ కంపెనీలను ముఖ్యమంత్రి నారా చందబాబు నాయుడు ఆహ్వానించనున్నారు.

==============================

ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర ఇంధన శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. దీనికోసం పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని చెప్పారు. విజయనగరం జిల్లా డెంకాడ మండలం పెదతాడివాడ వద్ద 2.8 కోట్ల రూపాయలతో విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి, రాష్ట్ర ఎంఎస్ఎంఈ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఈరోజు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ... విద్యుత్ ఛార్జీలను పెంచకుండానే పెద్ద ఎత్తున మౌలిక వసతులను కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలంలోనే సుమారు 78 వేలకు పైగా విద్యుత్ కనక్షన్లను మంజూరు చేశామని వెల్లడిస్తూ....

(వాయిస్ 31 సెకన్లు)

==============================

రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని అధిక రాబడిని పొందాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలో ఈరోజు మంత్రి రైతులకు డ్రోన్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆరుగాలం శ్రమించే రైతులకు వ్యవసాయాన్ని సులభతరం చేయాలనే ఉద్దేశ్యంతో కూటమి ప్రభుత్వం 80 శాతం రాయితీపై డ్రోన్లు అందిస్తోందన్నారు. సాగుకు సాంకేతికతను జోడిస్తే కూలీ ఖర్చులు, సమయం ఆదా అవుతుందని, ప్రతి ఒక్క రైతు కాలానుగుణంగా సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. పంటల పెరుగుదల, తెగుళ్ల నియంత్రణను పర్యవేక్షించడంతో పాటు దిగుబడి పెంచడానికి డ్రోన్లు సహాయపడతాయన్నారు.

విరామం

==============================

సాంకేతికత శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యాభివృద్ధికి సాంకేతిక సామర్థ్యం ఎంతో అవసరమని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. “నైపుణ్యాల నుంచి సామర్ధ్యాలకు శ్రామికశక్తి పరివర్తనను వేగవంతం చేయడం“ అనే అంశంపై సింగపూర్ పర్యటనలో భాగంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఆవిష్కరణలకు కేంద్రంగా, శ్రామిక శక్తి పరివర్తనలో అగ్రగామిగా ఉంచేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. యువతను ఉద్యోగాల కోసం మాత్రమే కాకుండా, భవిష్యత్‌కు అవసరమైన నైపుణ్యాలతో సిద్ధం చేస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయంగా వస్తున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో నైపుణ్యాభివృద్ధి కోర్సులను ప్రవేశపెడుతున్నామని వెల్లడించారు. పరిశోధనలు, ఆవిష్కరణలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడంపై సింగపూర్ వర్సిటీలతో కలసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

==============================

విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో దసరా ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్ ను ఆలయ కార్యనిర్వహణాధికారి శీనా నాయక్, వైదిక కమిటీ సభ్యులు ఈరోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈవో శీనా నాయక్ మాట్లాడతూ... ఈ ఏడాది కూడా దసరా మహోత్సవాలను వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు 11 రోజుల పాటు విశేషంగా దసరా మహోత్సవాలు జరుగుతాయని తెలిపారు. సెప్టెంబర్ 29వ తేదీ మూలా నక్షత్రం రోజున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారని వెల్లడించారు. ఈ ఉత్సవాల్లో సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యతనిస్తూ... అందరికీ అమ్మవారి దర్శనం కలిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అక్టోబర్ 2వ తేదీ విజయదశమి రోజున మహా పూర్ణాహుతి, కృష్ణా నదిలో తెప్పోత్సవం కార్యక్రమం నిర్వహిస్తామని ఈవో పేర్కొన్నారు.

==============================

ఫిడే (FIDE) ప్రపంచ మహిళల చెస్ ఛాంపియన్ షిప్ టైటిల్ ను దివ్య దేశ్‌ముఖ్ గెలుచుకున్నారు. జార్జియాలోని బటుమిలో ఈరోజు జరిగిన మ్యాచ్ లో ఆమె తన ప్రత్యర్థి కోనేరు హంపీపై విజయం సాధించారు. ఫైనల్స్‌లో వీరిద్దరి మధ్య జరిగిన తొలి ర్యాపిడ్ టై బ్రేకర్ డ్రాగా ముగియగా.. రెండవ గేమ్‌లో మొత్తం 75 ఎత్తుల్లో దివ్య విజయం సాధించారు. ఈ విజయంతో దివ్య గ్రాండ్ మాస్టర్ హోదాను అందుకొన్నారు. దీంతో భారత్‌లో ఈ హోదా అందుకొన్న నాలుగవ భారతీయ మహిళగా నిలిచారు.

==============================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాలతో ముగిసాయి. ఈ ఉదయం 81,463 పాయింట్ల వద్ద ప్రారంభమైన సెన్సెక్స్ చివరకు 572 పాయింట్లతో 80,891 వద్ద ముగిసింది. నిఫ్టీ 156 పాయింట్లు నష్టపోయి 24 వేల 680 వద్ద స్థిరపడింది.

==============================

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలో ఉత్తర కోస్తాంధ్ర, యానాంలో రేపు తేలిక పాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు వివరిస్తూ...

(వాయిస్ 23 సెకన్లు)

==============================
==============================